## క్లుప్తంగా

### దత్తత విషయంలో నిబంధనలు పాటించండి


మాట్లాడుతున్న పద్మావతి

నెల్లూరు(పొగతోట): బాలికా సదన్, శిశుగృహాలో ఉంటున్న పిల్లల్ని దత్తత ఇచ్చే విషయంలో నిబంధనలను తప్పక పాటించాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు బత్తుల పద్మావతి ఆదేశించారు. నగరంలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. దత్తత స్వీకార ప్రక్రియను సకాలంలో పూర్తి చేయాలన్నారు. తప్పిపోయిన, వదిలేసిన పిల్లలపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. ఐసీడీఎస్ పీడీ సువర్ణ, బాలల సంక్షేమ కమిటీ సభ్యులు మాధవి, రాజ్యలక్ష్మి, శ్రీనివాస్, బాలల పర్యవేక్షణాధికారి శ్రీధర్, జిల్లా బాలల పరిరక్షణాధికారి సురేష్, జీసీడీఓ మమత తదితరులు పాల్గొన్నారు.

### మాదకద్రవ్యాలతో దుష్పరిణామాలు


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న అధికారులు

నెల్లూరు సిటీ: మాదకద్రవ్యాలతో సంభవించే దుష్పరిణామాలపై అవగాహన పోస్టర్లను నగరంలోని ప్రొహిబిషన్, ఎక్సైజ్ కార్యాలయంలో జిల్లా అధికారి శ్రీనివాసులునాయుడు ఆధ్వర్యంలో శుక్రవారం ఆవిష్కరించారు. అసిస్టెంట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ జగదీశ్వర్‌రెడ్డి, ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు, ఈగల్ టీమ్ సిబ్బంది పాల్గొన్నారు.

### మూలస్థానేశ్వరాలయంలో వసంతోత్సవాలు

నెల్లూరు(బృందావనం): మూలాపేటలోని భువనేశ్వరి సమేత మూలస్థానేశ్వరస్వామి దేవస్థానంలో వసంతోత్సవాలను శుక్రవారం ప్రారంభించారు. తొలి రోజు శంకరజయంతి అలంకారంలో స్వామివారు దర్శనమిచ్చారు. ఉభయకర్తలుగా గ్రోసు సుబ్బారావు, సత్యలక్ష్మి దంపతులు వ్యవహరించారు. ఈఓ అర్వభూమి వెంకటశ్రీనివాసులురెడ్డి పర్యవేక్షించారు.

### గజలక్ష్మిగా కన్యకాపరమేశ్వరి

నెల్లూరు(బృందావనం): స్టోన్‌హౌస్‌పేటలోని కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో అమ్మవారు గజలక్ష్మిగా శుక్రవారం దర్శనమిచ్చారు. నగరోత్సవాన్ని వేడుకగా నిర్వహించారు. ఉభయకర్తలుగా శివకిశోర్, ప్రవీణ దంపతులు వ్యవహరించారు. దేవస్థాన చైర్మన్ కోట గురుబ్రహ్మం, కార్యనిర్వాహక అధ్యక్షుడు శేగు షణ్ముఖరావు, ప్రధాన కార్యదర్శి చిరంజీవి, కోశాధికారి జనార్దన్ తదితరులు పర్యవేక్షించారు.

### సామూహిక ఉపనయనాలు

నెల్లూరు(బృందావనం): శంకర జయంతిని పురస్కరించుకొని ఎఫ్సీఐ కాలనీలోని శ్రీనివాస కల్యాణమండపంలో బ్రాహ్మణ వటువులకు ఉచిత సామూహిక ఉపనయనాలను తుమ్మగుంట బ్రాహ్మణ సంఘ నగర శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు మాచవోలు కోటేశ్వరశర్మ, పాటూరు రామశేషయ్య, సుబ్రహ్మణ్యం, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

### ఎగ్జిబిషన్ ప్రారంభం



నెల్లూరు(బృందావనం): నగరంలోని వైఎమ్సీఏ గ్రౌండ్స్‌లో ఏర్పాటు చేసిన ఆర్‌ఆర్‌ఆర్, అవెంజర్స్ ఎగ్జిబిషన్‌ను మాజీ మేయర్ నందిమండలం భానుశ్రీ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎగ్జిబిషన్ నిర్వాహకుడు ఎస్కే బాబు మాట్లాడారు. జెయింట్ వీల్, మెర్రీ కొలంబస్, డ్రాగన్ ట్రైన్, కప్, సాసర్, టోరా టోరా, నోరూరించే తినుబండారాలు తదితరాలను ఏర్పాటు చేశామని వివరించారు. రోజూ సాయంత్రం నాలుగు నుంచి రాత్రి పది గంటల వరకు ప్రదర్శన ఉంటుందని తెలిపారు.

### ఆదిశేషయ్య సేవలు అభినందనీయం



నెల్లూరు(అర్బన్): అల్లూరు సీహెచ్‌సీలో సీనియర్ ల్యాబ్ టెక్నీషియన్‌గా పనిచేస్తూ ఉద్యోగ విరమణ పొందిన కోట ఆదిశేషయ్య సేవలు ఎనలేనివని డీఎంహెచ్ఓ సుజాత కొనియాడారు. సంతపేటలోని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయంలో ఆదిశేషయ్యకు ఆత్మీయ వీడ్కోలు సభను శుక్రవారం నిర్వహించారు. అనంతరం ఆయన్ను సత్కరించారు. జిల్లా మలేరియా నివారణాధికారి హుస్సేనమ్మ, ల్యాబ్ టెక్నీషియన్ యూనియన్ నేతలు రసూల్‌సాహెబ్, రాజేష్‌బాబు, మీరామొహిద్దీన్, నరేష్, నాగరాజు, యేసురత్నం, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# అధికారం మాది.. మా ఇష్టం

- ప్రభుత్వ భూమిని ఆక్రమించి ప్లాట్ల విక్రయాలు
- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు
- దీన్ని ప్రస్తుతం తొలగించి యథేచ్ఛగా ఆక్రమణ
- టీడీపీ కార్పొరేటర్ భర్త నిర్వాకం


వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పెట్టిన బోర్డు (ఫైల్)


భూమిని ఆక్రమించి వేసిన లేఅవుట్

నెల్లూరు సిటీ: అధికారాన్ని అడ్డు పెట్టుకొని టీడీపీ నేతలు రెచ్చిపోతున్నారు. ప్రభుత్వ స్థలాలను యథేచ్ఛగా కబ్జా చేస్తున్నారు. నెల్లూరు రూరల్ నియోజకవర్గంలోని ఓ టీడీపీ కార్పొరేటర్ భర్త ఖాళీ స్థలాన్ని కబ్జా చేసి తొమ్మిదంకణాల ప్లాట్లు ఏర్పాటు చేసి విక్రయిస్తున్న వైనం బయటపడింది. ఇది సర్కారు స్థలమని, ఆక్రమిస్తే చర్యలు చేపడతామంటూ హెచ్చరిక బోర్డును గత వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఏర్పాటు చేయించింది. అయితే కూటమి ప్రభుత్వం వచ్చాక బోర్డును తొలగించి యథేచ్ఛగా ఆక్రమించి ప్లాట్లుగా చేసి విక్రయిస్తున్నారు.

**ఏమి జరిగిందంటే..**

కల్లూరుపల్లి గ్రామ పరిధిలోని సర్వే నంబర్ 8లో కల్లూరుపల్లి పెద్ద చెరువు ప్రాంతంలో 1.7 ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని స్థానిక టీడీపీ కార్పొరేటర్ భర్త తన అనుచరులతో ఆక్రమించారు. ఆ స్థలంలో లేఅవుట్‌ను ఏర్పాటు చేసి తొమ్మిదంకణాల చొప్పున సుమారు 60 నుంచి 70 ప్లాట్లు వేశారు. ఒక్కో ప్లాట్‌ను రూ.ఐదు లక్షల చొప్పున కొన్నింటిని విక్రయించగా, మిగిలిన వాటిని తన అనుచరులకు కట్టబెట్టారు. టీడీపీ నేతల తీరుపై స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఈ స్థలం ఆక్రమణకు గురికాకుండా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయించింది. అయితే తెలుగు తమ్ముళ్లు దాన్ని తొలగించి ఆక్రమణలకు పాల్పడ్డారు.

## అగ్నిప్రమాద బాధితులకు ఆర్థిక సాయం



నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్ని ప్రమాదం సంభవించి సర్వం కోల్పోయిన కోటమిట్టలోని సర్తాజ్ కుటుంబానికి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు నగర నియోజకవర్గ ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి చేయూతనిచ్చారు. రామ్‌జీనగర్‌లోని పార్టీ కార్యాలయంలో వీరికి ఆర్థిక సాయాన్ని శుక్రవారం అందజేశారు. సర్తాజ్ కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. అనంతరం కార్పొరేటర్ కరిముల్లాను అభినందించారు. పార్టీ మైనార్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఖలీల్ అహ్మద్, మైనార్టీ విభాగ జిల్లా అధ్యక్షుడు సిద్ధిఖ్, నేతలు అబ్దుల్ మస్తాన్, అలీం, జహీద్ తదితరులు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో ఆదిశంకరాచార్యులు జయంతి


త్యాగరాజస్వామి మందిరంలో ఉపనయనాలు

నెల్లూరు(బృందావనం): వైశాఖ శుద్ధ పంచమిని పురస్కరించుకొని పొగతోటలోని ఆదిశంకర ధ్యాన మందిరంలో ఆదిశంకరాచార్యులు జయంతిని భక్తిశ్రద్ధలతో శుక్రవారం నిర్వహించారు. శంకరాచార్యులు పాదుకలకు అభిషేకాలు, శిష్యపరివార సమేత శంకరభగవత్పాదులకు పుష్పార్చనలను జరిపారు. ఉభయకర్తగా అన్నవరం సత్యనారాయణ వ్యవహరించారు. కాగా ఆదిశంకర సంస్మరణోత్సవాలను ఈ నెల ఏడు నుంచి 13 వరకు నిర్వహించనున్నామని మందిర నిర్వాహకుడు చక్రాల వెంకటలక్ష్మీనరసింహం తెలిపారు. అనుగ్రహభాషణలను గుంటూరులోని శృంగేరి విరూపాక్ష విద్యాపీఠ పీఠాధిపతి గంభీరానందభారతి నిర్వహించనున్నారని చెప్పారు. దుర్గాకృష్ణకుమార్, నాగరత్నకుమారి, శ్రీకాంత్‌శర్మ, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

- ఆదిశంకరాచార్య జయంతిని పురస్కరించుకొని నగరంలోని రాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానంలో ప్రత్యేక పూజలను నిర్వహించారు. అనంతరం అమ్మణ్ణి సన్నిధిలో రాహుకాల పూజలు, దీపాలను వెలిగించారు. వేదపారాయణం, కుంభహారతులు, పల్లకిసేవను విశేషంగా నిర్వహించారు. ఈఓ కోవూరు జనార్దన్‌రెడ్డి పర్యవేక్షించారు.
- శంకర జయంతిని పురస్కరించుకొని వేదాయపాళెంలోని త్యాగరాజస్వామి మందిరంలో బ్రాహ్మణ ఉపనయనాలను నిర్వహించారు. గాయత్రి సేవా సమాజ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పురోహితుడు మన్నూరు నాగరాజశర్మ తదితరులు పాల్గొన్నారు.


ఆదిశంకర ధ్యాన మందిరంలో..


రాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానంలో..

## చలివేంద్రాలతో ఎంతో ఉపయోగం



నెల్లూరు(అర్బన్): మజ్జిగ చలివేంద్రాలు ఎంతో ఉపయోగపడతాయని సంతపేట పోలీస్‌స్టేషన్ సీఐ దశరథరామయ్య పేర్కొన్నారు. ట్రంక్‌రోడ్డు సమీపంలోని దేవిరెడ్డి వారి వీధిలో మజ్జిగ చలివేంద్రాన్ని నెల్లూరు డిస్ట్రిక్ట్ హోల్‌సేల్ కెమిస్ట్స్ అండ్ డ్రగ్గిస్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం ఏర్పాటు చేశారు. దీన్ని ప్రారంభించిన అనంతరం నిర్వాహకులను సీఐ అభినందించారు. అసోసియేషన్ అధ్యక్షుడు అశోక్‌కుమార్, కార్యదర్శి వెంకటేశ్వర్లు, కోశాధికారి లీలామోహన్ తదితరులు పాల్గొన్నారు.

## చీరల అందజేత



నెల్లూరు(బృందావనం): పడారుపల్లిలోని పీసీ రెడ్డి సమాజ మందిరంలో పేద, దివ్యాంగ మహిళలకు చీరలు, పండ్లను క్రాంతి మహిళా మండలి అధ్యక్షురాలు గుమ్మడి వెంకటలక్ష్మి ఆధ్వర్యంలో శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. కావలిరెడ్డి మల్లికార్జునరెడ్డి వర్ధంతిని పురస్కరించుకొని ఆయన సతీమణి మాలతిరెడ్డి సౌజన్యంతో కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. మమతారెడ్డి, లక్ష్మి, వరలక్ష్మమ్మ, గుమ్మడి రాజగోపాలరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని వివిధ సబ్‌స్టేషన్లలో మరమ్మతుల కారణంగా పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా శనివారం ఉండదని నెల్లూరు టౌన్ ఈఈ శ్రీధర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇరుగాళమ్మ సబ్‌స్టేషన్ పరిధిలోని శాంతినగర్, బట్వాడిపాళెం సెంటర్, రామయ్యబడి వీధి, ఏసీబీ కార్యాలయం, రాజావారివీధి తదితర ప్రాంతాల్లో ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సరఫరా ఉండదని చెప్పారు.

- డైకస్‌రోడ్డు సబ్‌స్టేషన్ పరిధిలోని కొండదిబ్బ, అలంకార్ సెంటర్, బ్రాహ్మణవీధి, ఫతేఖాన్‌పేట, రమేష్‌రెడ్డినగర్, పెద్దబజార్, చిన్నబజార్, కలెక్టరేట్, ఆచారివీధి, పెద్ద పోస్టాఫీస్ ప్రాంతం, మధ్యపతివారి వీధి తదితర ప్రాంతాల్లో ఉదయం ఏడు నుంచి తొమ్మిది గంటల వరకు సరఫరా ఉండదని పేర్కొన్నారు.
- ఏకేనగర్ సబ్‌స్టేషన్ పరిధిలోని జిల్లా ప్రభుత్వాస్పత్రి, మెయిన్ రోడ్డు, జడ్జి క్వార్టర్స్ తదితర ప్రాంతాల్లో ఉదయం 7.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సరఫరా ఉండదని తెలిపారు.

### డాక్టరేట్ ప్రదానం

నెల్లూరు (టౌన్): పెద్దచెరుకూరులోని సిరి గార్డెన్స్‌కు చెందిన కనుపూరు మణిపాల్‌కు డాక్టరేట్ లభించింది. వృక్షశాస్త్ర విభాగంలో ప్రొఫెసర్ మాధవశెట్టి పర్యవేక్షణలో పరిశోధన చేసినందుకు గానూ డాక్టరేట్‌ను ఎస్వీ వర్సిటీ ఆధ్వర్యంలో ప్రదానం చేశారు.

### పౌష్టికాహార పంపిణీ

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో నిర్వహిస్తున్న క్రీడా శిక్షణ శిబిరాల్లో పాల్గొన్న క్రీడాకారులకు పౌష్టికాహారాన్ని స్టేడియం వాకర్స్ ఆధ్వర్యంలో శుక్రవారం పంపిణీ చేశారు. మెంటా రామ్మోహన్, ప్రసాద్, గుండె వ్యాధి నిపుణుడు పీర్‌సాహెబ్, ఏఎస్పీ విజయభాస్కర్‌రెడ్డి, అసోసియేషన్ అధ్యక్షుడు సత్యనారాయణ, సెక్రటరీ సురేష్, వేలూరు రంగారావు, కనకట్ల రఘురామ్ ముదిరాజ్, బాసం శేషగిరిరావు తదితరులు పాల్గొన్నారు.

### గిరిజన బాలిక చదువుకు అండగా ఉంటాం

నెల్లూరు(బారకాసు): గిరిజన బాలిక చదువుకు అండగా ఉంటామని మేయర్ స్రవంతి భరోసా ఇచ్చారు. బాలసదన్‌లో ఆశ్రయం పొందుతున్న బాలికను శుక్రవారం కలిసిన అనంతరం ఆమె మాట్లాడారు. కోట మండలానికి చెందిన బాలికకు అన్యాయంగా వివాహం చేసిన విషయాన్ని గిరిజన విద్యా చైతన్య వేదిక రాష్ట్ర నేత చెంచయ్య తన దృష్టికి తీసుకొచ్చారని చెప్పారు. బాలికకు ఇష్టం లేకుండానే వివాహం జరపడంతో ఎవరికీ చెప్పకుండా ఇంటి నుంచి వచ్చేసి బాలసదన్‌లో ఆశ్రయం పొందుతున్నారని తెలిపారు. చదువుకోవాలనే కోరిక ఉందనే విషయాన్ని తనకు తెలియజేశారని, దీంతో బాలిక చదువుకు అండగా ఉంటానని భరోసా ఇచ్చారు.

### నేత్రపర్వంగా పుష్ప పల్లకి ఉత్సవం



నెల్లూరు(బృందావనం): భగవద్రామానుజాచార్యులు అష్టోత్తర సహస్ర జయంతి తిరునక్షత్ర మహోత్సవాలను నగరంలోని తల్పగిరి రంగనాథస్వామి దేవస్థానంలో వేడుకగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా రంగనాథుడికి పుష్పపల్లకి మహోత్సవం, భగవద్రామానుజాచార్యులుకు విశేష పుష్పాలంకారాన్ని శుక్రవారం అర్ధరాత్రి జరిపారు. ఉభయకర్తలుగా మాగుంట కుటుంబసభ్యులు వ్యవహరించారు.

- గొడుగుల ఉత్సవం, మంగళాశాసనోత్సవం .. రంగనాథుడు, భగవద్రామానుజాచార్యులుకు కలశాభిషేకాన్ని నిర్వహించారు.
- భగవద్రామానుజాచార్యులు జయంతిని సామాజిక సమరసత వేదిక జిల్లా శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. తల్పగిరి రంగనాథస్వామి దేవస్థాన ఎదురుగా గల గోపురంవీధిలోని ఆయన విగ్రహాన్ని పుష్పాలతో అలంకరించారు. మోమిడి శ్రీనివాసులు, జయప్రకాష్, పోలయ్య, సతీష్, సుబ్బారావు, శేగు రాము, శీనయ్య, అరవ రామ్మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

### ఏసీ షార్ట్ సర్క్యూట్‌తో అగ్నిప్రమాదం

నెల్లూరు సిటీ: ఏసీలో షార్ట్ సర్క్యూటై మంటలు వ్యాపించడంతో ఇంట్లోని గృహోపకరణాలు కాలిపోయిన ఘటన చోటుచేసుకుంది. వివరాలు.. కోటమిట్టలో నివాసం ఉంటున్న షారూఖ్ ఏసీని ఆన్ చేసి గురువారం రాత్రి నిద్రించారు. తెల్లవారుజామున ఇంట్లో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. దీంతో బయటకొచ్చిన ఆయన అగ్నిమాపక శాఖకు సమాచారమిచ్చారు. వారు వచ్చి మంటలను అదుపు చేశారు. ఇంట్లోని టీవీ, ఫ్రిజ్, మంచం దగ్ధమయ్యాయి.

## విజయకుమార్‌రెడ్డిని కలిసిన నేతలు



నెల్లూరు సిటీ: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు రూరల్ నియోజకవర్గ సమన్వయకర్త ఆనం విజయకుమార్‌రెడ్డిని మాజీ కార్పొరేటర్ మదన్‌మోహన్‌రెడ్డి మర్యాదపూర్వకంగా శుక్రవారం కలిశారు. పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు చెవిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కార్పొరేటర్ బొబ్బల శ్రీనివాస్‌యాదవ్, జిల్లా అధికార ప్రతినిధి రావు శ్రీనివాసరావు, రవీంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అందుబాటులో సేంద్రియ ఆహార ఉత్పత్తులు



నెల్లూరు (పొగతోట): సేంద్రియ ఎరువులతో పండించిన ఆర్గనిక్ ఆహార ఉత్పత్తులు, చిరుధాన్యాలను ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చామని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేత, పేర్నాటి న్యాచురల్స్ ఫౌండర్ పేర్నాటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. మాగుంట లేఅవుట్లోని మొదటి క్రాస్‌రోడ్డులో పేర్నాటి న్యాచురల్స్‌ను శుక్రవారం ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడారు. 110 రకాల ఉత్పత్తులు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. 150 ఎకరాల్లో వివిధ రకాల పండ్లు, కూరగాయలు, ఇతర చిరుధాన్యాలను సాగు చేస్తున్నామని వివరించారు. సేంద్రియ ఎరువులతో పంటలు సాగుచేస్తామంటూ ముందుకొచ్చే రైతులను ప్రోత్సహిస్తామన్నారు. రానున్న రోజుల్లో తెలంగాణ, తమిళనాడుతో పాటు రాష్ట్రంలోని ఇతర జిల్లాల్లో పేర్నాటి న్యాచురల్స్ ఆహార ఉత్పత్తులను అందుబాటులోకి తెచ్చేందుకు కృషి చేస్తామని వెల్లడించారు. అనంతరం హేమ సుస్మితారెడ్డి మాట్లాడారు. 20 ఏళ్ల కృషి ఫలితంగా ప్రజలకు అవసరమైన ఆహార ఉత్పత్తులను అందుబాటులోకి తీసుకొచ్చామని తెలిపారు. పేర్నాటి బిందు ఐశ్వర్య, ఎమ్మెల్సీ మేరిగ మురళి తదితరులు పాల్గొన్నారు.

## పంట కాలువలపై ఆక్రమణలు తొలగించాలి


సూచనలు చేస్తున్న నందన్

నెల్లూరు(బారకాసు): నగరంలోని పంట కాలువల ఆక్రమణలను గుర్తించి పూర్తిగా తొలగించాలని కమిషనర్ నందన్ ఆదేశించారు. నగరంలోని 30వ డివిజన్లో గల పోలీస్ కాలనీ, తెలుగుగంగ కాలనీ, రెవెన్యూ కాలనీ, చంద్రబాబునగర్ తదితర ప్రాంతాల్లో శుక్రవారం పర్యటించిన ఆయన మాట్లాడారు. కాలువల్లో పూడికతీత, సిల్ట్ ఎత్తివేతను క్రమం తప్పకుండా జరపాలని సూచించారు. అవసరమైన ప్రాంతాల్లో కాలువల నిర్మాణాలకు ప్రణాళికలను సిద్ధం చేయాలని కోరారు. నూతన నిర్మాణాలకు సంబంధించిన ఇంటి పన్నుల వివరాలను, అసెస్మెంట్ నంబర్లను తనిఖీ చేసి.. భవనాలకు కొలతలేసి పరిశీలించారు. అనంతరం డైకస్‌రోడ్డు కూడలిలోని అన్న క్యాంటీన్‌ను సందర్శించారు. పరిసర ప్రాంతాల్లో రోడ్డును ఆక్రమించి చేపట్టిన నిర్మాణాలను వెంటనే తొలగించాలని ఆదేశించారు. అనంతరం 31వ డివిజన్ అక్కచెరువుపాడులో ఏర్పాటు చేసిన లేఅవుట్‌ను పరిశీలించారు. సిటీ ప్లానర్ పద్మజ, వెటర్నరీ వైద్యుడు మదన్‌మోహన్ తదితరులు పాల్గొన్నారు.

- ప్రజా సమస్యల పరిష్కార వేదిక.. వివిధ సామాజిక మాధ్యమాల ద్వారా అందుతున్న సమస్యల పరిష్కారంపై సంబంధిత విభాగాల సూపరింటెండెంట్లు పూర్తిస్థాయిలో దృష్టి సారించాలని కమిషనర్ నందన్ ఆదేశించారు. అన్ని విభాగాల సూపరింటెండెంట్లు, సీనియర్ అసిస్టెంట్లు, జూనియర్ అసిస్టెంట్లతో సమీక్ష సమావేశాన్ని కార్పొరేషన్ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో నిర్వహించారు. నగరపాలక సంస్థ మేనేజర్ ఇనాయతుల్లా తదితరులు పాల్గొన్నారు.
- టౌన్ ప్లానింగ్ విభాగాధికారులతో వారాంతపు సమీక్ష సమావేశాన్ని కమిషనర్ నిర్వహించారు. సిటీ ప్లానర్ పద్మజ, ఏసీపీలు వేణు, ప్రకాష్, సూపరింటెండెంట్ మునిరత్నం తదితరులు పాల్గొన్నారు.

## వేదగిరిలో ఆరు నుంచి బ్రహ్మోత్సవాలు


ఆహ్వాన పత్రికలను ఆవిష్కరిస్తున్న శ్రీధర్‌రెడ్డి తదితరులు

నెల్లూరు సిటీ: నరసింహకొండపై వెలసిన వేదగిరి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో బ్రహ్మోత్సవాలు ఈ నెల ఆరు నుంచి 16 వరకు జరగనున్న నేపథ్యంలో ఆహ్వాన పత్రికలను నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి శుక్రవారం ఆవిష్కరించారు. నగరంలోని ఎమ్మెల్యే కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, ఈఓ గోపీ, ఉత్సవ కమిటీ కార్యనిర్వాహకుడు అచ్యుత్‌రెడ్డి, సభ్యులు ముత్తంశెట్టి శీనయ్య, చెరుకూరు సింహాద్రి, పురిణి సరస్వతి, శ్రీనివాసులురెడ్డి, తోడేటి కామాక్షమ్మ, జయమ్మ, కొత్తకోట కవిత తదితరులు పాల్గొన్నారు.

## డిమాండ్లు నెరవేర్చేంత వరకు ఆందోళన


కలెక్టరేట్ వద్ద ధర్నా

నెల్లూరు(అర్బన్): తమ న్యాయమైన డిమాండ్లను నెరవేర్చేంత వరకు ఆందోళన కార్యక్రమాలను కొనసాగిస్తామని ఏపీ కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు భానుమహేష్ పేర్కొన్నారు. వివిధ డిమాండ్లతో సంతపేటలోని డీఎంహెచ్ఓ కార్యాలయం వద్ద కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు నాలుగు రోజులుగా ఆందోళన చేస్తున్నారు. ఇందులో భాగంగా డీఎంహెచ్ఓ కార్యాలయం నుంచి కలెక్టరేట్ వరకు ప్లకార్డులతో ప్రదర్శనను శుక్రవారం నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్ వద్ద ధర్నా చేపట్టి అధికారులకు వినతిపత్రాన్ని అందజేశారు. అసోసియేషన్ కార్యదర్శి రెబెకా, నేతలు సుగుణ, చైతన్య, హనుమానాయక్, హెప్సిబా, జ్యోతి, సుమ, అంజలి తదితరులు పాల్గొన్నారు.

### వ్యక్తి బలవన్మరణం

నెల్లూరు సిటీ: మద్యంలో గడ్డి మందు కలిపి తాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడిన వ్యక్తి చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందారు. నెల్లూరు రూరల్ పోలీసుల కథనం మేరకు.. అల్లీపురంలో నివాసం ఉంటున్న వెంకటరమణ (47), సునీత దంపతులకు ఒక కుమార్తె సంతానం. నాలుగు నెలల క్రితం భర్త పనికెళ్లలేదని భార్య మందలించారు. అప్పటి నుంచి ఇంటికి వెంకటరమణయ్య రాలేదు. గత నెల 20న అతను మద్యంలో గడ్డిమందు కలిపి తాగి భార్య వద్దకు వచ్చారు. వెంటనే హాస్పిటల్‌కు సునీత తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ వెంకటరమణ శుక్రవారం మృతి చెందారు. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.